## క్లుప్తంగా

### వైద్య శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న యువకులు

పెందుర్తి: మండలంలోని గుర్రంపాలెం పంచాయతీ అక్కిరెడ్డిపాలెంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరానికి చక్కటి స్పందన లభించింది. హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రి, అక్కిరెడ్డిపాలెం యూత్ సంయుక్త నిర్వహణలో డాక్టర్ కేయూకే శంకర్ ఆధ్వర్యంలో వైద్య బృందం 200 మందికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. అక్కిరెడ్డిపాలెంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన యువకుల ద్వారా 50 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉగ్గిన గోవింద్, గ్రామపెద్దలు అక్కిరెడ్డి చినరమణ, గంధ్రెడ్డి నగేష్, నక్క మహేష్, అక్కిరెడ్డి మూర్తి, ఉగ్గిన అచ్చిబాబు, కోశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### అప్పన్న సన్నిధిలో అవధాని నాగఫణీంద్రశర్మ



నాగఫణీంద్రశర్మకు అప్పన్న జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో తిరుమలేశ్వరరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని ఆదివారం ప్రముఖ అవధాని మాడుగుల నాగఫణీంద్రశర్మ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించి, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటాన్ని ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు అందజేశారు.

### ఆలయ నిర్మాణానికి బోకం శ్రీనివాస్ విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న బోకం స్వామినాయుడు తదితరులు

సబ్బవరం: స్థానిక శివాలయం పునఃర్నిర్మాణంలో భాగంగా తవ్వవానిపాలెం గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త బోకం శ్రీనివాస్ లక్షా 1 రూపాయి విరాళమిచ్చారు. ఈ విరాళాన్ని స్వామివారి ఆలయం వద్ద ఆయన సోదరుడు, తవ్వవానిపాలెం సర్పంచ్ బోకం స్వామినాయుడు చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం అందించారు. ఆలయ కమిటీ సభ్యులు బర్ల రమణ, కోరాడ శ్రీనివాసరావుతో పాటు పలువురు పెద్దలు పాల్గొన్నారు.

### దశల వారీగా సమగ్రాభివృద్ధి



రాంపురంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి: నియోజకవర్గాన్ని దశల వారీగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. రాంపురంలో జల్ జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన మంచి నీటి పథకం పనుల శంకుస్థాపనతో పాటు, జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన రోడ్లను ప్రారంభించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెందుర్తిని అభివృద్ధిపథంలో నిలిపేందుకు నిబద్ధతతో పనిచేస్తున్నట్లు తెలిపారు. కూటమిలోని బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులంతా కలిసిమెలిసే ఉన్నారని పేర్కొన్నారు. ఎంపీపీ మధుపాడ నాగమణి, జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, ఎంపీటీసీ గండి హిమబిందు, ఎంపీడీవో అప్పలరాజు, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

### 129 మందికి కంటి వైద్య పరీక్షలు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పినమడక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్, శంకర్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పినమడక, డొంకాడ, కొత్తూరు, పూడివానిపాలెం కాలనీలకు చెందిన 129 మంది శిబిరంలో పాల్గొన్నారు. నేత్ర పరీక్షల అనంతరం 24 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వీరందరికీ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో ఆపరేషన్ చేయడం జరుగుతుందని అమ్మా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గొంపా వెంకటరావు, శంకర్ ఫౌండేషన్ వైద్యుడు దీపక్ చెప్పారు.

# భక్తుల బసలో.. అప్పన్న పాలన

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ... రాష్ట్రంలోనే స్వయంప్రతిపత్తి గల ప్రముఖ దేవస్థానాల్లో ఒకటి. ఇంతటి ఘనత ఉన్నప్పటికీ పన్నెండేళ్లుగా సొంత కార్యాలయ భవనం అంటూ లేదంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. అధికారుల నిర్లక్ష్యమో... ప్రణాళికా లోపమో... మరే ఇతర కారణాలో తెలియదుగానీ.. ఇప్పటి వరకు సొంత కార్యాలయ భవన నిర్మాణానికి కనీసం శంకుస్థాపన కూడా చేయలేదు. భక్తుల సేవకు నిర్మించిన భవనాల్లో చేరి, కార్యకలాపాలు నిర్వహించాల్సిన పరిస్థితి.

- సింహాచలం దేవస్థాన పరిపాలన కార్యాలయ భవన నిర్మాణం ఎప్పుడో?
- పుష్కర కాలం కావస్తున్నా.. నిర్మాణం కాని నూతన భవనం
- బీఆర్‌టీఎస్ విస్తరణలో తొలగించిన దేవస్థాన పరిపాలన భవనం
- అప్పటి నుంచి విజయరామరాజు కల్యాణమండపంలో నిర్వహణ
- టీటీడీ సత్రం వీఐపీ గదుల్లో ఈవో, ఎస్‌డీసీ చాంబర్లు



పరిపాలన కార్యాలయం ఏర్పాటు చేసిన విజయరామరాజు కల్యాణమండపం





అడవివరం ప్రధాన రహదారిని ఆనుకుని గతంలో ఉన్న ఈవో కమ్ పరిపాలన భవనం(ఫైల్) (దీన్నే బీఆర్‌టీఎస్ విస్తరణలో తొలగించారు)

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి కొండదిగువ అడవివరం ప్రధాన రహదారిలో 2013 వరకు అతి పెద్ద పరిపాలన కార్యాలయ భవనం ఉండేది. ఈవో చాంబర్‌తో పాటు, విభాగాధిపతులకు, సూపరింటెండెంట్లకు ప్రత్యేక గదులు, సిబ్బంది విధులు నిర్వర్తించేందుకు ప్రత్యేక హాళ్లు, ప్రాంగణాలు ఉండేవి. ఎంతో మంది ఈవోలు ఆ భవనం నుంచే పాలన సాగించారు. సింహాచలానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉండటంతో దేవస్థానం సిబ్బందికి ఎంతో సౌకర్యంగా ఉండేది. దేవస్థానం కార్యాలయానికి పనిమీద వెళ్లే విజిటర్స్‌కు సింహాచలం ఆర్టీసీ బస్టాండ్‌లో దిగగానే కార్యాలయం కనిపించేది.

**బీఆర్‌టీఎస్ విస్తరణలో తొలగింపు**

2013లో ప్రారంభమైన పాత గోశాల జంక్షన్ నుంచి పాత అడవివరం జంక్షన్ బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా అదే ఏడాది ఈ భవనాన్ని తొలగించారు. దీని ప్రతిఫలాన్ని దేవస్థానానికి అప్పట్లోనే జీవీఎంసీ అందించింది. వరాహ పుష్కరిణికి వెళ్లే మార్గంలో ఉన్న విజయరామరాజు కల్యాణమండపంలోకి హుటాహుటిన దేవస్థాన పరిపాలన కార్యాలయాన్ని తాత్కాలిక ప్రాతిపదికన మార్పు చేశారు. ఆ పక్కనే ఉన్న టీటీడీ కల్యాణమండపంలోని ఆరు వీఐపీ గదులను ఈవో చాంబర్, దేవస్థానం భూపరిరక్షణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం, ఇతర వినియోగాలకు కేటాయించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వాటిల్లోనే ఆయా కార్యాలయాలు కొనసాగుతున్నాయి.



ఎస్‌డీసీ కార్యాలయాలు ఏర్పాటు చేసిన టీటీడీ సత్రంలోని వీఐపీ గదులు

**సొంత భవనంపై ధ్యాసేదీ?**

భక్తుల కోసం నిర్మించిన భవనాలను స్వాధీనం చేసుకుని పన్నెండేళ్లుగా పాలనా వ్యవహారాలు నడుపుతున్నారు తప్ప, కొత్తగా పరిపాలన కార్యాలయ నిర్మాణానికి కనీసం చొరవ చూపని దుస్థితి. సింహగిరి దివ్యక్షేత్రం పనుల పేరిట రూ.కోట్లలో దేవస్థానం ఖర్చుచేసింది. కొన్ని అనవసర పనులకు సైతం రూ.కోట్లు వెచ్చించిన దాఖలాలున్నాయి. ముఖ్యంగా కొట్టడాలు... కట్టడాలు.. పేరిట రూ.కోట్లు వృథా చేశారన్న విమర్శలు కూడా ఉన్నాయి. కానీ దేవస్థానం పరిపాలన కార్యాలయ సొంత భవనం నిర్మాణంపై మాత్రం అధికారులు దృష్టి సారించలేదు. అదిగో... ఇదిగో... అంటూ ఇప్పటివరకు కాలక్షేపం చేస్తూ వస్తున్నారు.

**దేవస్థానం ఆదాయానికి గండి**

మరోవైపు పుష్కర కాలంగా కొండదిగువ విజయ రామరాజు కల్యాణ మండపంలో పరిపాలన కార్యాలయం, టీడీపీ సత్రంలోని ఆరు వీఐపీ గదుల్లో ఈవో చాంబర్, ఎస్‌డీసీ చాంబర్ తదితరాలు ఏర్పాటు కావడంతో పెద్ద మొత్తంలో దేవస్థానం ఆదాయాన్ని కోల్పోయింది. వీఐపీ గదులను అంతకు ముందు అద్దెకు ఇచ్చేవారు. దేవస్థానానికి ఎవరైనా ప్రముఖులు వస్తే వారికి ఆ గదులను కేటాయించేవారు. విజయరామరాజు కల్యాణ మండపాన్ని ఒక వివాహ బృందానికి రోజుకు రూ.4 వేలు నుంచి రూ.5 వేలు వరకు అద్దెకు ఇచ్చేవారు. దీంతో దేవస్థానం ఆ మేరకు 12 ఏళ్లుగా ఆదాయాన్ని కోల్పోయింది. ఈ మొత్తం భారీ స్థాయిలోనే ఉంటుందని అంచనా.

**పరిపాలన కార్యాలయ విభాగాలు**

లీగల్ సెక్షన్, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్, అకౌంట్స్ సెక్షన్, లీజెస్ సెక్షన్, ఇంజినీరింగ్ సెక్షన్, కంప్యూటర్ భూపరిపరిరక్షణ విభాగం, శానిటేషన్ విభాగం, ఎలక్ట్రికల్ స్టోర్స్ తదితర విభాగాలు.

**ప్రణాళికలతో సరి**

పాత అడవివరం జంక్షన్ నుంచి హనుమంతవాక వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డుమార్గంలో ఉన్న రెండవ టోల్‌గేట్ సమీపంలో దేవస్థానం పరిపాలన కార్యాలయ నిర్మాణానికి అప్పట్లో ప్రణాళిక చేశారు. ఆ ప్రణాళిక మరుగున పడింది.

**నిర్మాణ ప్రణాళిక ఉంది**

రెండవ ఘాట్‌రోడ్డు ప్రారంభంలో దేవస్థానం నూతన పరిపాలన కార్యాలయ భవన నిర్మాణ ప్రణాళిక ఉంది. అప్పట్లో కొన్ని టెక్నికల్ ఇబ్బందులు, దివ్యక్షేత్రం మాస్టర్‌ప్లాన్‌లో మార్పులు, చేర్పులు కారణంతో ఆలస్యం జరిగింది. త్వరలోనే నూతన కార్యాలయం నిర్మాణం జరుగుతుంది.

–రమణ, ఈఈ, సింహాచలం దేవస్థానం

# ప్రభుత్వ భూమి కాపాడాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న చింతగట్ల ప్రజాప్రతినిధులు, ప్రజలు

పెందుర్తి: 'కూటమి ప్రభుత్వంలోని కొందరు వ్యక్తుల సహకారంతో మారుతీకుమార్ అనే వ్యక్తి తమ ప్రాంతంలో ఉన్న రూ.25 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాడంటూ చింతగట్లకు చెందిన పలువురు నాయకులు, స్థానికులు ఆందోళనకు దిగారు. దీనిపై సర్వే రిపోర్ట్ అక్రమ మార్గంలో అతనికి అనుకూలంగా ఇచ్చారని, దాన్ని తక్షణమే రద్దు చేసి, ఫ్రీహోల్డ్ నుంచి ఆ భూమిని తొలగించాలని డిమాండ్ చేశారు. చింతగట్ల పంచాయతీ ఇప్పిలివానిపాలెంలోని సర్వే నెం.81/2లో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కూటమి నాయకులు చెరబడుతున్న నేపథ్యంలో టీడీపీ నేత, స్థానిక సర్పంచ్ భర్త గనిశెట్టి కనకరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ దిగుమర్తి మారుతికుమార్ అనే వ్యక్తి గ్రామంలో నివాసం లేకున్నా అతనికి 5 ఎకరాల భూమి కట్టబెట్టేందుకు ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పంచాయతీలోని ప్రజలకు ఇంత అన్యాయం జరుగుతున్నా స్థానిక టీడీపీ నాయకుడు ఇప్పిలి చిన్నారావు, ఇతర టీడీపీ నాయకులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో పంచాయతీ ప్రజలకు ప్రజాప్రతినిధులుగా, నాయకులుగా సమాధానం చెప్పాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. తాము కూటమి ప్రభుత్వంలో ఉన్నా కొందరు కూటమి నాయకుల అరాచకాలను అడ్డుకోవాలన్నదే తమ సంకల్పం అన్నారు. ఈ భూమి వ్యవహారంలో ప్రజలకు న్యాయం జరగకపోతే తాము నిరాహార దీక్షకు అయినా సిద్ధమేనని స్పష్టం చేశారు. టీడీపీ నేత, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు నందవరపు అప్పలరాజు మాట్లాడుతూ ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అయితే చూస్తూ ఊరుకోమన్నారు. తక్షణమే అధికారులు స్పందించి సర్వే నెం.81/2లోని ఐదెకరాల ప్రభుత్వ భూమిని రక్షించాలని కోరారు. మాజీ ఉపసర్పంచ్ గొంప అప్పారావు, స్థానిక నాయకుడు బొట్టా సంతోష్‌కుమార్, పలువురు నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# చేపలు, మాంసం దుకాణాలతో ట్రాఫిక్ ఇక్కట్లు



వాడచీపురుపల్లిలో చేపల బజారు వద్ద రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలు

పరవాడ: వాడచీపురుపల్లిలో నిర్వహిస్తున్న చేపలు, మాంసం దుకాణాల వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఆదివారం నుంచి శుక్రవారం వరకు సంతబయలు, బుర్రు మామిడి చెట్టు వద్ద నిర్వహిస్తున్న మాంసం, చేపల దుకాణాలకు వచ్చే వారితో దుకాణాలు కిక్కిరిసి పోతున్నాయి. దీంతో దుకాణాలకు వచ్చే మాంసం ప్రియులు తమ వాహనాలను రోడ్లపై అడ్డదిడ్డంగా నిలపడంతో ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి. రహదారిలో నిత్యం బస్సులు, భారీ వాహనాల రాకపోకలుంటాయి. రోడ్లపై ఇష్టానుసారంగా నిలిపిన వాహనాలతో రహదారిలో తిరిగే బస్సులు, కార్లు, ఇతర వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రయాణికులు కూడా అవస్థలుపడుతున్నారు. ఈ ఇబ్బందుల్ని దృష్టిలో ఉంచుకుని దుకాణాలను ట్రాఫిక్ ఇబ్బందుల్లేని చోటుకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# బుద్ధిగా ప్రవర్తించి, బాగుపడండి

**రౌడీ షీటర్లకు సీఐ సతీష్‌కుమార్ కౌన్సెలింగ్**



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: రౌడీ షీటర్లు బుద్ధి మార్చుకుని ప్రవర్తిస్తే వారి భవిష్యత్ బాగు చేసుకునే అవకాశం కల్పిస్తామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ అన్నారు. సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచుతున్నామన్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు నగర పోలీస్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జైలుపాలు కావాల్సి వస్తుందని రౌడీ షీటర్లను హెచ్చరించారు. చెడు ప్రవర్తన వలన తమ కుటుంబాలు సమాజంలో చిన్న చూపునకు గురవుతాయని, దాన్ని దృష్టిలో ఉంచుకుని మంచిగా మెలగాలని హితవుపలికారు. ఎవరైనా అసాంఘిక కార్యకలపాలకు పాల్పడినట్లు పోలీసుల దృష్టికి వస్తే పీడీ యాక్ట్ ప్రయోగించడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. మంచి నడవడికతో ఉంటే రౌడీషీట్‌లు ఎత్తివేయడానికి ఉన్నతాధికారులు ఆలోచన చేస్తారని పేర్కొన్నారు. పలు సూచనలు చేశారు. ఎస్ఐ స్వామినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

## వాక్ ఇన్ డ్రైవ్‌లో 24 మంది ఎంపిక



వాక్ ఇన్ డ్రైవ్‌లో పాల్గొన్న నిరుద్యోగ యువత

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో కోహన్స్ లైఫ్ సైన్సెస్ పరిశ్రమ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో ఆదివారం వాక్ ఇన్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ వాక్ ఇన్ డ్రైవ్ కార్యక్రమంలో పరవాడ, అచ్యుతాపురం, జగ్గయ్యపేట ప్రాంతాల్లో నడుస్తున్న కోహన్స్ లైఫ్ సైన్సెస్ ఉత్పత్తి కేంద్రాల్లో ప్రొడక్షన్ బ్లాక్‌లో పనిచేయడానికి ప్రతిభ, అనుభవం కలిగిన తాజా బీఎస్సీ అభ్యర్థుల నుంచి నేషనల్ అప్రెంటీస్‌షిప్ ట్రైనింగ్ స్కీం(ఎన్ఏటీఎస్) కింద దరఖాస్తులను స్వీకరించారు. ఈ వాక్ ఇన్ డ్రైవ్ ప్రోగాంలో వివిధ ప్రాంతాల నుంచి 116 మంది అభ్యర్థులు హాజరుకాగా వారిలో 24 మందిని ఎంపిక చేశారు. వారిలో 6గురు మహిళా అభ్యర్థులను ఎంపిక చేయడం జరిగిందని యాజమాన్య ప్రతినిధులు, టాలెంట్ అక్విజిషన్ హెడ్ వంశీధర్ చెప్పారు. ఈ ఇంటర్వ్యూలను ఏపీఐ యూనిట్-1 హెచ్‌ఆర్ హెడ్ సురేష్, టెక్నికల్ హెచ్‌ఆర్ టీం సభ్యులు నిర్వహించారు.

# అదృశ్యమైన సాయిసాత్విక్ ఆచూకీ లభ్యం



సాయిసాత్వికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ: కనిపించకుండా పోయిన పరవాడ సినిమాహాలు కూడలికి చెందిన కూండ్రపు సాయి సాత్విక్ ఆచూకీ లభ్యమైందని పరవాడ సీఐ ఆర్. మల్లికార్జునరావు చెప్పారు. కూడలిలో నివాసం ఉంటున్న కూండ్రపు సత్యారావు కుమారుడు కూండ్రపు సాయిసాత్విక్(15) పదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రుల మీద అలిగి శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి పారిపోయాడు. దీంతో తండ్రి సత్యారావు పరవాడ పోలీసులను ఆశ్రయించాడు. వెంటనే రంగంలోకి దిగిన పరవాడ పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా అతి తక్కువ సమయంలో సాయిసాత్విక్‌ను ఆచూకీని స్టీల్‌ప్లాంట్ ఉక్కు క్లబ్ వద్ద కనుగొన్నారు. హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేక ఇంటి నుంచి పారిపోయినట్లు సాయిసాత్విక్ వెల్లడించాడని దీనిపై విద్యార్థికి కౌన్సెలింగ్ ఇచ్చి శనివారం రాత్రి తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. గంటల వ్యవధిలో తప్పిపోయిన విద్యార్థి ఆచూకీని కనుగొని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులను గ్రామస్తులు అభినందించారు.


# అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

## ఆదిత్యునికి అభిషేకాలు



సూర్యనారాయణస్వామి

పెందుర్తి: సుజాతనగర్లోని సూర్యనారాయణస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువ జామున స్వామి వారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

## కరి మబ్బులు.. జడివాన



వరుణుడు ఎట్టకేలకు రైతాంగానికి ఊరటనిచ్చాడు. కోటి ఆశలతో ఖరీఫ్ పంటలు వేసేందుకు సిద్ధంగా ఉన్న రైతులకు కొన్నాళ్లుగా వర్షం ముఖం చాటేసింది. అయితే శనివారం చిరు జల్లులు పడగా.. ఆదివారం సాయంత్రం ఆకాశం దట్టంగా మబ్బులు పట్టి, భారీ వర్షం కురిసింది. దీంతో వరి నారు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు పట్టణంలో వరుసగా రెండో రోజు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. - పెందుర్తి



# గోరింటాకు విశిష్టతపై అవగాహన



చేతులకున్న గోరింటాకు చూపుతున్న ఫౌండేషన్ మహిళా విభాగం సభ్యులు

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆషాఢమాసంలో గోరింటాకు విశిష్టతపై ఫౌండేషన్ సభ్యులు విస్తృత ప్రచారం నిర్వహించారు. కూర్మన్నపాలెంలో ఎంవీఆర్ అపార్ట్‌మెంట్‌లో వేంకటేశ్వర దేవాలయం కేంద్రంగా ఫౌండేషన్ మహిళా విభాగం సభ్యులు గోరింటాకు విశిష్టతపై ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కన్వీనర్ పెదపాటి కృష్ణవేణి మాట్లాడుతూ దేవాలయం కేంద్రంగా భజన, సత్సంగం, పౌర్ణమికి సామూహిక హారతి, ఆత్మీయ బంధువులను కలవడం వంటి విషయాలను తెలియజేశారు. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్.కుమారి, ఎం.సుశీల, ఎన్.లక్ష్మి, పి.రామచంద్రరావు, పరవాడ సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు పాల్గొన్నారు.

## నాట్యారాధన చిన్నారులకు అభినందన

పెదగంట్యాడ: జాతీయ స్థాయి నవరస శాస్త్రీయ, జానపద సంగీత నృత్య కళారూపాల పోటీల్లో వుడా కాలనీకి చెందిన నాట్యారాధన ఆర్ట్స్ అకాడమీకి బహుమతులు లభించాయి. చిలకలూరిపేటలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో అకాడమీకి చెందిన 11 మంది విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంతో పాటు పలు బహుమతులు సాధించారు. ఈ మేరకు అకాడమీలో ఆదివారం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్ విజేతలను అభినందించారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం





ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి ప్రతినిధులు

పెందుర్తి: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సరిపల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం విస్తృత ప్రచారం చేశారు. సమితి ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కె.త్రినాథరావు, బి.పైడన్న, సన్యాసి, లక్ష్మీభవాని, అచ్చియ్యమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.